క్లుప్తంగా

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు



ఆత్మకూర్: పట్టణంలోని బీసీకాలనీ ఎంబీ చర్చిలో, మూలమల్ల, ఖానాపూర్, రేచింతల చర్చిల్లో బుధవారం ప్రత్యేక ప్రార్థన చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. పాస్టర్లు రేవా జర్మియా, విద్యాసాగర్, డేవిడ్, శ్యాంసుందర్, సుమన్, సత్యానందం, నరేష్‌బాబు ఆధ్వర్యంలో బైబిల్ సూక్తులు వినిపించి ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేవారు. కార్యక్రమంలో క్రైస్తవులు పాల్గొన్నారు.

కేతేపల్లిని మండల కేంద్రం చేయాలి

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని ఎంపీటీసీల ఫోరం మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాట్టినేని గోపాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. గతంలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో గ్రామాన్ని మండల కేంద్రంగా మారుస్తున్నారనే అంశం ముందుకు వచ్చినా, అది ఆచరణలోకి రాలేదని, ఇప్పుడైన మంత్రి జూపల్లి ప్రత్యేక చొరవ తీసుకొని గ్రామాన్ని మండల కేంద్రంగా మార్చాలని కోరారు.

పీజీ సీటు సాధించిన వైద్య విద్యార్థి



చెట్ల తరుణ్

ఆత్మకూర్: ఆత్మకూర్‌కు చెందిన చెట్ల తరుణ్ నాయుడు ఎంబీబీఎస్ పూర్తిచేసి ఉచిత పీజీ పిడియాట్రిక్ చిన్నపిల్లల వైద్య నిపుణుడు సీటును సాధించాడు. చెట్ల శ్రీనివాసులు, రాజేశ్వరి దంపతుల పెద్దకుమారుడు చెట్ల తరుణ్ ఉచిత ఎంబీబీఎస్ సీటును సాధించి మహబూబ్‌నగర్‌లోని ఎస్వీఎస్ మెడికల్ కళాశాలలో 2024లో ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. పీజీ పరీక్షల్లో మొదటిసారి రాసి సంగారెడ్డిలోని మహేశ్వర మెడికల్ కళాశాలలో ఉచిత పీజీ సీటును సాధించాడు. ఈ సందర్భంగా తరుణ్ నాయుడిని స్థానికులు అభినందించారు.

3న ఉచిత కంటి వైద్య శిబిరం

అమరచింత: పట్టణంలోని డీఎంఆర్ఎం ప్రభుత్వ ఆస్పత్రిలో ఈనెల 3న దేశాయి ప్రకాష్ రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సేవా సమితి అధ్యక్షుడు కలాం పాషా తెలిపారు. కందూర్ రాంరెడ్డి లయన్ క్లబ్ ఏనుగొండ మహబూబ్‌నగర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. మండలంలోని ఆ యా గ్రామాల్లో కంటిచూపు, కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రతి ఒక్కరు హాజరై వైద్య సేవలు పొందాలని కోరారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు తీసుకొని రావాలని సూచించారు.

ఆధ్యాత్మికతతో జీవితం ఆనందమయం

గోపాల్‌పేట: ఆధ్యాత్మికతతో జీవితం ఆనందమయం అవుతుందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో బ్రహ్మకుమారీస్‌కు సంబంధించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తిర్మలాపూర్ గ్రామానికి చెందిన బాల్‌రెడ్డి కూతురు మంజుల బ్రహ్మకుమారీస్ అనే సంస్థను స్థాపించి చిన్నప్పటి నుంచి ఆధ్యాత్మికత వైపు వెళ్లి తన జీవితాన్ని త్యాగం చేసిందన్నారు. ఆధ్యాత్మికతతో మనిషి జీవితానికి పరమార్థం తెలుస్తుందన్నారు. నాయకులు ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు వెళ్లిన అయ్యప్ప స్వాములు



కొత్తకోట: కొత్తకోట పట్టణంలోని శ్రీ భూతనాథ అన్న ప్రసాద క్షేత్రంలో బుధవారం అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో అయ్యప్ప దీక్ష స్వీకరించిన స్వాములు దాదాపు 80 మంది గోపాలకృష్ణ గురుస్వామి ఇరుముడి కట్టించుకుని యాత్రగా శబరిమల బయలుదేరారు. అయ్యప్ప భక్తులు అధిక సంఖ్యలో రావడంతో భూతనాథ అన్నప్రసాద క్షేత్రం జనసంద్రంగా మారి, అయ్యప్ప నామ స్మరణతో మార్మోగింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా అయ్యప్ప సేవాసమితి అధ్యక్షులు శ్రీ ధూపం నాగరాజు ఆధ్వర్యంలో అందరికీ అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు.



ఉమెన్స్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కేక్ కటింగ్



వనపర్తిలో కేక్ కట్ చేస్తున్న పుర కార్మికులు



బుద్దారం గండి ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తుల రద్దీ

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

- ఆలయాల్లో పోటెత్తిన భక్తులు
- పూజల్లో పాల్గొన్న ప్రముఖులు

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా బుధవారం న్యూ ఇయర్ వేడుకలను ప్రజలు ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. కొత్త వాహనాలకు పూజలు చేయించేందుకు సైతం భక్తులు ఉదయం నుంచే ఆలయానికి బారులు కట్టారు. చర్చిల్లో క్రీస్తు సందేశాన్ని పాస్టర్‌లు వినిపించారు. ప్రత్యేక విందులు, వినోదాలతో యువతరం జోరుగా సందడి చేసింది. ఇంటింటా రంగురంగుల రంగవల్లను అందంగా తీర్చిదిద్దారు. వనపర్తి మున్సిపల్ పారిశుద్య కార్మికులు బుధవారం తెల్లవారు జామున కేక్ కట్ చేశారు. ఉమెన్స్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో న్యూ ఇయర్ కేక్‌ను కట్ చేశారు.

● ఆత్మకూర్ మండలంలో సాయిబాబా, అయప్ప స్వామి ఆలయాలకు వేలాది సంఖ్యలో భక్తులు తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. పోలీసులు గట్టి బందోబస్తును నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం నిర్వహకులు అన్నిరకాల ఏర్పాట్లు చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు దివాన్జీ ప్రభాకర్‌రావ్, సంతోష్‌కుమార్, రమేష్‌శెట్టి, సింగం ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లోని షిర్డీ సాయిబాబా ఆలయంలో భక్తుల రద్దీ

ప్రముఖుల శుభాకాంక్షలు...

మక్తల్ నియోజకవర్గ పరిధిలోని ప్రజలకు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, సీతదయాకర్‌రెడ్డి, జెడ్పీ మాజీచైర్మన్ స్వర్ణమ్మ, రాష్ట్ర కల్లు గీత డిపార్ట్‌మెంట్ ఛైర్మన్ కేషం నాగరాజుగౌడ్, మాజీ ఎంపీపీలు శ్రీధర్‌గౌడ్, బంగారు శ్రీనివాసులు, విండో అధ్యక్షులు గాడి కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాయత్రి రవియాదవ్, వైస్ ఛైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, కౌన్సిలర్లు శుభాకాంక్షలు తెలిపారు.

● పాన్‌గల్ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో మంగళవారం అర్ధరాత్రి నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా యువత, పిల్లలు, పెద్దలు కేరింతలు కొడుతూ కేక్‌లు కట్ చేసి కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలికారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఇళ్ల ముంగిట ముగ్గులు వేసి రంగులతో ముస్తాబు చేశారు. వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ శ్రీనివాసులు బందోబస్తు నిర్వహించారు.

మొదటిరోజు ఆలయాల్లో పూజలు

● కొత్త సంవత్సరం మొదటిరోజు ఉమ్మడి గోపాల్‌పేట మండలంలోని ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. గోపాల్‌పేట మండలంలోని బుద్దారం గండి ఆలయం, కోదండ రామస్వామి ఆలయం, కేశంపేట వేణుగోపాలస్వామి ఆలయం, మున్ననూరు ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కుకున్నారు.

నూతన సంవత్సరం సంబురాలు

● మదనాపురం మండలంలో ప్రధాన శివాలయాలు, ఆంజనేయస్వామి ఆలయం, చర్చిలు మసీద్‌ల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మదనాపురం, దుప్పల్లి, అజ్జకొల్లు, కొన్నూరు, కొత్తపల్లి, దంతనూరు, గోవిందహళ్లి గ్రామాల్లో పండుగ వాతావరణం కన్పించింది.

● వీపనగండ్ల మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో మహిళలు, యువకులు కేక్‌లు కట్ చేసి సంబరాలు చేశారు. తూంకుంట, సంగినేనిపల్లి, కల్వరాల, వీపనగండ్లలో మహిళలు, యువకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఆత్మకూర్‌లో పూజలు చేస్తున్న సీతమ్మ



వీపనగండ్లలో పూజలు చేస్తున్న, గ్రామస్తులు



ఇంటి ముంగిట రంగు, రంగుల ముగ్గులు



మదనాపురం చర్చిలో కేక్ చేస్తున్న క్రైస్తవులు



పాన్‌గల్ మండలం బొల్లిగట్టు ఆలయంలో పూజలు చేసిన పాఠశాల విద్యార్థులు



వనపర్తిలో యువకుల జోష్

విద్యార్థులకు బోధన కరువు



కేజీబీవీలో చదువుకుంటున్న విద్యార్థినులు

సమ్మెలో కేజీబీవీ ఉద్యోగులు

పాన్‌గల్: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పనిచేసే ప్రత్యేకాధికారులు(ఎస్ఓ), కాంట్రాక్టు రెసిడెంట్ టీచర్లు(సీఆర్‌టీలు), పీజీసీఆర్‌టీలు, ఇతర బోధనేతర సిబ్బంది తమ సమస్యల పరిష్కారం కోసం 23 రోజులుగా సమ్మె చేస్తున్నారు. దీంతో విద్యార్థినులకు పాఠాలు బోధించేవారు కరవయ్యారు. సమ్మె చేస్తున్న వారి విషయమై ప్రభుత్వం ఇప్పటి వరకు స్పష్టమైన హామీ ఇవ్వలేదు. దీంతో సమ్మె ఎన్ని రోజులు కొనసాగుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఆందోళన ఇలాగే కొనసాగితే విద్యా ప్రమాణాలు పడిపోయే ప్రమాదం ఉందని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మండల పరిస్థితి..

మండల కేంద్రంలో ఉన్న కస్తూర్బా విద్యాలయంలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు కొనసాగుతోంది. విద్యాలయంలో 212 మంది విద్యార్థినులు చదువుతున్నారు. వారికి పాఠాలు బోధించడానికి 13 మంది సీఆర్‌టీలు పని చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని సమగ్ర శిక్ష ఆధీనంలో ఉన్న కేజీబీవీ ఉద్యోగులు, ఎమ్మార్సీ కార్యాలయంలో పనిచేస్తున్న సీఆర్‌పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, ఐఈఆర్‌పీలు సమ్మె చేస్తుండటంతో మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం కూడా మూతపడింది. విద్యా శాఖకు సంబంధించిన పలు నివేదికలు తయారు చేయడం అధికారులకు ఇబ్బందిగా మారింది.

ఫలితాలపై ప్రభావం..

బోధన సిబ్బంది సమ్మెలో పాల్గొనడంతో పదో తరగతి ఫలితాలపై ప్రభావం పడుతుందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థినులకు పాఠాలు చెప్పేవారు లేకపోవడంతో వారు నోట్స్ రాసుకుంటూ కాలం గడుపుతున్నారు.

ఘనంగా మారోజు వీరన్న జయంతి



మారోజు వీరన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న స్ఫూర్తి వేదిక నాయకులు

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో వర్గకుల నిర్మూలన సిద్ధాంతకర్త మారోజు వీరన్న 63వ జయంతిని బుధవారం మహనీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మారోజు వీరన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహనీయుల స్ఫూర్తి వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాజారాంప్రకాష్ మాట్లాడుతూ వర్గ కుల నిర్మూలన పోరాట సిద్ధాంతకర్త తెలంగాణ మలిదశ ఉద్యమానికి ఊపిరి పోసిన నాయకుడు, దళిత బహుజన ఉద్యమ స్ఫూర్తి బహుజన ప్రజాస్వామిక విప్లవ ఉద్యమ సిద్ధాంతకర్త కామ్రేడ్ మారోజు వీరన్న అని కొనియాడారు. కార్యక్రమంలో కవి పండితుడు బూరోజు గిరి రాజాచారి, గంధం నాగరాజు, కావలి బాలస్వామి నాయుడు, ప్రజా గాయకుడు బాలేమియా, విశ్వబ్రాహ్మణ సంఘం ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరచారి, మాదవాచారి, సత్యంచారి, రమేష్ చారి, యుటిఎఫ్ జిల్లా నాయకుడు వెంకటేష్, తపస్ నాయకుడు విజయకుమార్ రంగస్వామి, కురుమూర్తి, మాధవాచారి, కృష్ణయ్య, మీదిండ్ల కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

నేడు చలో మున్సిపల్ ముట్టడి

అమరచింత: ప్రభుత్వం ప్రకటించిన ఉచిత విద్యుత్ జీరో బిల్లు, గ్యాస్ సబ్సిడీలు అందక ప్రజలు సతమతమౌతున్నారని, ప్రజా సమస్యలను పరిష్కరించాలని గురువారం చలో మున్సిపల్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాస్‌లైన్ పార్టీ మండల కార్యదర్శి రాజన్న తెలిపారు. పట్టణంలోని ఆయా వార్డులలో బుధవారం ఇంటింటికి వెళ్లి గ్యాస్ సబ్సిడీ, జీరో బిల్లులు వర్తిస్తున్నాయా లేదా అన్న విషయాలను ఇంటి యాజమానులకు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్యాస్ సబ్సిడీ ఇస్తున్నామని చెబుతున్న ఇందుకు మున్సిపల్ అధికారులు సకాలంలో వాటి వివరాలను పంపకపోవడంతో సబ్సిడీ అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యల పరిష్కారం కోసం బాధిత లబ్ధిదారులతో కలిసి మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు పాల్గొని సమస్యను పరిష్కరించే వరకు పోరాడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు ప్రసాద్, భక్తి, కురుమన్న, సామేలు, మసలమని, రాంచందర్, జిలాని, ప్రేమరత్నం, పలువురు పాల్గొన్నారు.



ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకుంటున్న మాస్‌లైన్ పార్టీ నాయకులు

ఎమ్మెల్యేను సన్మానించిన నాయకులు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మదనాపురం మండల నాయకులు

మదనాపురం: కాంగ్రెస్ మండల నాయకులు బుధవారం ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డిని బుధవారం హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పూలమాల శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు హనుమాన్ రావు, వడ్డే రాములు, కొండన్న, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలని మంత్రికి వినతి



మంత్రి జూపల్లిని కలిసిన కల్వరాల గ్రామస్తులు

వీపనగండ్ల: గ్రామాభివృద్ధికి సహకారం అందించాలని కోరుతూ బుధవారం మంత్రి జూపల్లి కృష్ణారావును కల్వరాల గ్రామస్తులు కలిసి విన్నవించారు. తమ గ్రామంలో మౌలిక వసతుల ఏర్పాటుకు సహకారాన్ని అందించాలని కోరారు. సమన్వయంతో వ్యవహరించి గ్రామాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకురావాలని మంత్రిని కోరినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో చక్ర వెంకటేష్, వెంకటరాజయ్య, రమేష్‌గౌడ్, రాజయ్య, అఖిల్, వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

వృద్ధులకు చీరల పంపిణీ



కనిమెట్టలోని చర్చిలో వృద్ధులకు చీరలు అందజేస్తున్న పాస్టర్

కొత్తకోట రూరల్: మండలంలోని కనిమెట్ట గ్రామంలోని చర్చిలో నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం స్థానిక చర్చి పాస్టర్ వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో ఇరుముడి



మదనాపురంలో ఇరుముడి కట్టుకున్న అయప్ప స్వాములు

మదనాపురం: మండల కేంద్రంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో బుధవారం ఇరుముడి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. నలభై రోజులు మాల ధరించిన అయ్యప్ప స్వాములు శబరిమల తరలివెళ్లేందుకు ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. గురుస్వా మి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన అయ్యప్ప భక్తు లు తరలివచ్చారు. ఆ ప్రాంతమంతా అయ్య ప్పస్వామి నామస్మరణతో పులకరించింది.



ఆత్మకూర్‌లో అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఆత్మకూర్: అయ్యప్పస్వామి పూజలు ఆత్మకూర్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక అయ్యప్ప ఆలయంలో మాజీ ఎంపీపీలు డాక్టర్ శ్రీధర్‌గౌడ్, బంగారు శ్రీనివాసులు, శృతిజువెల్లర్స్ అధినేత గాడి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నద్దాన కార్యక్రమం, దీక్షా పరులకు బిక్ష నిర్వహించారు.గురుస్వాములు, దీక్షాపరులు, బక్తులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్‌లో సేవల పునరుద్ధరణ

అమరచింత: మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్‌లో బుధవారం బ్యాంకు సేవలు యథావిధిగా కొనసాగాయి. మూడు రోజుల క్రితం బ్యాంకులో చోరీకి విఫలయత్నం కావడంతో రెండు రోజులు బ్యాంకు సేవలు నిలిపేశారు. బుధవారం యథావిధిగా అధికారులు ఖాతాదారులకు సేవలు అందించారు. బ్యాంకులో సీసీ కెమెరాల పునరుద్ధరణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. వినియోగదారులకు సేవలు అందిస్తున్నామని బ్యాంకు మేనేజర్ శివశంకర్ తెలిపారు.



అమరచింత యూనియన్ బ్యాంకులో సేవలు పొందుతున్న ఖాతాదారులు

రావులను పరామర్శించిన రాచాల



కానాయపల్లిలో రావుల సురేంద్రనాథ్‌రెడ్డిని పరామర్శిస్తున్న రాచాల యుగంధర్‌గౌడ్

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ రావుల సురేంద్రనాథ్ రెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురై గుండె ఆపరేషన్ చేయించుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ నివాసానికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. త్వరగా ఆరోగ్యంగా ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆకాంక్షించారు. ఆయన వెంట బీసీ పొలిటికల్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు వనం తిరుపతయ్య యాదవ్, రాష్ట్ర కార్యదర్శి వీవీ గౌడ్, అంజన్నయాదవ్, మహ్మద్ ఉన్నారు.

ఉపాధ్యాయుడిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

వీపనగండ్ల: ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ ప్రభుత్వ పాఠశాలలో గెజిటెడ్ హెడ్‌మాస్టర్ రాములుపై విద్యార్థి తల్లిదండ్రులు అకారణంగా దాడి చేశారని, అందుకు నిరసనగా మండల కేంద్రంలో వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అయ్యప్పమాలతో వచ్చిన విద్యార్థినిని చదువులో వెనకబడ్డావని మందలించడంతో ఆ విద్యార్థి తల్లిదండ్రులు మరుసటి రోజు పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయుడిపై దాడి చేసి విద్యార్థి కాళ్ళు మొక్కించారని ఇది ఉపాధ్యాయుల మనోభావాలను అవమానించడమేనని అన్నారు.ఉపాధ్యాయులపై దాడి చేయడం సహించరాని నేరమని, దాడికి పాల్పడ్డ వారిని ప్రభుత్వపరంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి మురళీ, నర్సింహ, రాముడు, వెంకటేష్, సీఐటీయూ నాయకులు వెంకటేశ్వర్ల గౌడ్, నవీన్, శేషు, ఎస్ఎఫ్ఐ నాయకులు నీలోత్పల్, సహదేవుడు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడిపై దాడిని ఖండిస్తూ నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు